క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో హనుమద్వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఆంజనేయ స్వామి, సీతారామ, లక్ష్మణులకు విశేష పూజలు చేశారు. రామకోటి గ్రంథాల ఊరేగింపు, రామకోటి స్తూపంలో నిక్షిప్త మహోత్సవాన్ని సాయంత్రం నిర్వహించారు. ఉభయకర్తలుగా చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

విద్యుత్ భవన్ వద్ద భారీ నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలను పరిరక్షించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్ పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని విద్యుత్ భవన్ వద్ద శుక్రవారం చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు చేస్తున్న యత్నాలను వ్యతిరేకిస్తూ జిల్లాలో చేపట్టే నిరసనలు, ఆందోళనల్లో విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు పెంచలప్రసాద్, నాగయ్య, హరినారాయణ, జయశంకర్, జగన్, రాజు, భాస్కర్, సందీప్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


రైతుల జీవనోపాధి మెరుగుపడాలి



మాట్లాడుతున్న డాక్టర్ బాలసుబ్రమణియన్

ముత్తుకూరు: సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా సన్న, చిన్నకారు రైతుల జీవనోపాధి మెరుగుపడాలని ముత్తుకూరు మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ అన్నారు. కళాశాలలో శుక్రవారం జరిగిన సమీకృత వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐసీఏఆర్, సీఐఎఫ్ఈ, మత్స్య కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మురళీధర్‌లు మాట్లాడుతూ చేపలు – వరి, చేపలు – బాతులు, చేపలు – కోళ్లు, చేపలు – గొర్రెల తదితర సమీకృత వ్యవసాయ పద్ధతులను అలవరుచుకోవాలన్నారు. సామగ్రిని రైతులకు అందజేశారు. మత్స్య విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ ధనపాల్, డాక్టర్ మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సీఈఓ

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరు ఆర్అండ్ఆర్ కాలనీలోని అదానీ విద్యా మందిర్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగశాల, ఇతర సదుపాయాలతో అత్యాధునికంగా గదుల నిర్మాణం జరుగుతుందన్నారు. మత్స్యకారుల పిల్లల విద్యాభివృద్ధికి అదానీ ఫౌండేషన్ కట్టుబడి ఉందన్నారు. జూనియర్ కళాశాల ద్వారా ఉన్నత విద్య అందించాలన్నదే ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతి ఆశయమన్నారు. కార్యక్రమంలో రాజేష్ రంజన్, శ్రీనివాసరావు, గణేష్‌శర్మ, వేణుగోపాల్, మృత్యుంజయరామ్, వెంకటేష్ భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కీచకులపై పోక్సో కొరడా

- నేరం చేస్తే శిక్ష తప్పదు
- లైంగిక దాడికి పాల్పడితే జీవితమంతా జైలే
- ఈ ఏడాది 11 మంది నిందితులకు శిక్ష

అభం.. శుభం ఎరుగని చిన్నారులను చిదిమేసే నీచులు ఎక్కడో ఉండరు. శ్రేయోభిలాషులు.. బంధువులు.. సన్నిహితుల రూపంలో చుట్టే ఉంటూ లైంగిక దాడులు, వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వీరే వరుసలు మరిచి చిన్నారులను చిదిమేస్తున్నారు. ఈ తరహా నేరాలను కట్టడి చేయడంతో పాటు 18 ఏళ్ల లోపు వారి సంరక్షణకు పోక్సో చట్టాన్ని 2012లో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది.



నెల్లూరు(క్రైమ్): చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడి పైశాచికానందం పొందుతున్న కామాంధుల పాలిట సింహస్వప్నంగా ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం మారింది. నేరస్తులకు 20 ఏళ్లకుపైగా శిక్షలను న్యాయస్థానాలు విధిస్తుండటంతో వారు జీవితాంతం జైళ్లలోనే మగ్గిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెల్లో మూడు కేసుల్లో నిందితులకు శిక్ష పడి వారు కేంద్ర కారాగారంలో జైలు జీవితాన్ని గడుపుతున్నారు.

కఠిన శిక్షలు

పోక్సో చట్టం అమల్లోకి రాక ముందు బాలికలపై లైంగిక దాడికి పాల్పడేవారికి ఇండియన్ పీనల్ కోడ్‌లోని శిక్షలు అమలయ్యేవి. అయితే ఈ చట్టంలోని శిక్షలతో నేరాలు తగ్గుముఖం పట్టకపోవడంతో మరింత కఠిన శిక్షలతో కూడిన పోక్సో చట్టాన్ని రూపొందించారు. పిల్లలపై లైంగిక దాడులు, వేధింపులు, హత్యచేయడం వంటి కేసుల్లో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొనే వారికి కోర్టులో ముందస్తు బెయిల్ ఉండదు. నేరం రుజువైతే 20 ఏళ్లకుపైగా జైలుశిక్ష పడే అవకాశం ఉంది. సామాన్యుల కన్నా ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు ఈ తరహా నేరాలకు పాల్పడితే వారికి ఎక్కువ శిక్ష పడేలా చట్టాన్ని రూపొందించారు. 18 ఏళ్లలోపు బాలికలు లైంగిక దాడులు, వేధింపులకు గురైతే పోక్సో చట్టం కింద.. 18 ఏళ్లపైబడిన వారికి నిర్భయ చట్టం కింద కేసులు నమోదు చేస్తారు.

అవగాహన అంతంతమాత్రమే

మహిళలు, చిన్నారుల కోసం రూపొందించిన చట్టాలు కఠినమైనవి. అయితే బాధితులకు సరైన అవగాహన లేకపోవడం, దర్యాప్తులో అనేక లోపాలతో నిందితులు నామమాత్రపు శిక్షలతో తప్పించుకుంటున్నారు. కఠినమైన శిక్షలు నామమాత్రంగానే ఉంటాయనే భావనతో అనేక మంది చిన్నారులపై నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. జిల్లాలోనూ ఈ తరహా నేరాలు జరుగుతున్నాయి. కేసుల్లోని నిందితులకు కఠినమైన శిక్షలు పడటం ద్వారానే నేరాలను నియంత్రించే అవకాశం ఉందని భావించిన ఎస్పీ కృష్ణకాంత్ పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. కేసుల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించి.. అన్ని ఆధారాలతో సహా కోర్టులో అభియోగ పత్రాలను త్వరితగతిన దాఖలు చేయిస్తుండటంతో నిందితులకు శిక్షలు పడుతున్నాయి. మరోవైపు రక్షణ చట్టాలు, గుడ్.. బ్యాడ్ టచ్‌పై జిల్లాలోని విద్యాసంస్థల్లో బాలికలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. లైంగిక వేధింపులు, దాడులపై నిర్భయంగా ఫిర్యాదు చేస్తే నిందితులకు శిక్ష పడేలా చూస్తామని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

ఈ ఏడాదిలో ఇలా..

పోక్సో కేసుల్లో ఈ ఏడాది 11 మందికి జైలుశిక్షలు పడి కారాగారాల్లో శిక్షను అనుభవిస్తున్నారు. వీరిలో 25 ఏళ్ల నుంచి 50 ఏళ్ల పైబడినవారే అధికంగా ఉన్నారు. ఒక బాలుడు సైతం ఉన్నారు. తప్పిదాలే వీరి జీవితాలను ఛిద్రం చేశాయి. జైలు జీవితాలను గడిపి వృద్ధాప్యంలోనే చెర నుంచి విముక్తులవుతారు. దీంతో వీరు కన్న కలలు కల్లలుగానే మిగిలిపోనున్నాయి.

కొన్ని కేసుల్లో శిక్షలిలా..

⇨ ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం బూదనంలో బాలికపై అదే గ్రామానికి చెందిన మస్తాన్‌బాబు లైంగిక దాడికి పాల్పడ్డారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.23 వేల జరిమానా విధించారు

⇨ కొడవలూరు మండలం మిక్కిలింపేటకు చెందిన రవికుమార్ ఎల్కేజీ చదువుతున్న నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. కొడవలూరు పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేశారు.

⇨ సంగం మండలం ఎస్‌హెచ్ చెక్‌పోస్టు వద్ద లారీలో పోరుమామిళ్లకు చెందిన సుబ్బరాయుడు ప్రయాణిస్తుండగా, బాలికను డ్రైవర్ బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు.

⇨ కొడవలూరు మండలానికి చెందిన వెంకటరమణ తాను సహజీవనం చేస్తున్న మహిళ కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. పై కేసుల్లో నేరాలు రుజువు కావడంతో వీరికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం మండలం రాఘవరెడ్డికాలనీకి చెందిన కుమార్ పక్కింట్లో ఉండే చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఘటనలో నేరం రుజువు కావడంతో కుమార్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

16న సింహపురి యునైటెడ్ క్యారల్స్



పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): యేసుక్రీస్తు జనన సందేశాన్ని సంగీతం ద్వారా తెలియజేసే సింహపురి యునైటెడ్ క్యారల్స్‌ను సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నామని బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సంతపేటలోని బిషప్ హౌస్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం కన్వీనర్ రెవరెండ్ డేవిడ్ దయాసాగర్ మాట్లాడారు. గాయక, వాద్య బృందాలు శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించనున్నారని చెప్పారు. అనంతరం కో కన్వీనర్ జానీజో మాట్లాడారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి సాయంత్రం 6.30కు ప్రారంభంకానున్న ర్యాలీ వివిధ ప్రాంతాల మీదుగా బటావ్డిపాళెం సెంటర్ వరకు సాగుతుందని వివరించారు. సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ సంస్థ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్, ఫాదర్ ఇన్నయ్య, ఊరందూరు సురేంద్రబాబు, రెవరెండ్ రాజశేఖర్ దాసరి, రెవరెండ్. సందీప్, అసోసియేట్లు విద్యాధర్, మహేష్, దినేష్, ఫ్రైజర్ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయి జూనియర్స్ త్రోబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున రామయ్యబడి విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారని హెడ్‌మాస్టర్ వేదమూర్తి పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన పీఈటీ వెంకట్రావును ఫతేఖాన్‌పేటలోని పాఠశాలలో శుక్రవారం సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల తొమ్మిది నుంచి 11 వరకు నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో యశ్విన్, బాలికల విభాగంలో శరణ్య పాల్గొన్నారని తెలిపారు.

నిర్మాణాన్ని ఆపేందుకే వివాదం

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ములుమూడి బస్టాండ్ సమీపంలోని ఆజాద్ సెంటర్‌లో గల అమర వీరుల స్మారక స్తూపం భారీ వర్షాలతో కుంగిందని, దీనికి మరమ్మతులు చేపట్టే సమయంలో వివాదానికి బీజేపీ తెరదీసిందని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్ ఆరోపించారు. ఈ మేరకు ఆజాద్ సెంటర్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నేతలు ఖాదర్‌బాషా, అజీజ్ అహ్మద్, సర్తాజ్, వాజిద్, జాఫర్, మెహిద్దీన్, జియా, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని తెరిపించరూ..

నెల్లూరు(బృందావనం): దేవదాయ శాఖ అధికారుల తీరుతో నవాబుపేటలోని కృష్ణ ధర్మరాజ స్వామి దేవస్థానం వైభవాన్ని కోల్పోతోందని అగ్నికుల క్షత్రియ సంఘీయులు ఆవేదన వ్యక్తం చేశారు. 43 రోజులుగా ఆలయాన్ని మూసేసి, నిత్యపూజ, ధూపదీప, నైవేద్యాలను నిలిపేయడంపై దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీలతకు వినతిపత్రాన్ని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చమ్మండి రాము, తిరువత్తూరు శివశంకర్ తదితరులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడారు. అనధికారికంగా పెత్తనం చెలాయిస్తున్న వ్యక్తి దేవస్థానానికి సంబంధించిన బంగారు, వెండి వస్తువులను మాయం చేశారని ఆరోపించారు. పూజలు నిర్వహించేందుకు తమకు అనుమతిస్తే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నేతలు సెంథిల్‌కుమార్, కొత్తూరు మురళీమోహన్, సుధీర్, వేలూరు అరుణాచలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాలల మహాగర్జనకు తరలిరండి

నెల్లూరు రూరల్: గుంటూరులోని నల్లపాడులో ఆదివారం నిర్వహించనున్న మాలల మహాగర్జనకు తరలిరావాలని భారత రిపబ్లికన్ భీమ్‌రావు పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. వర్గీకరణ విషయమై కేంద్ర మంత్రి అమిత్‌షాను త్వరలో కలవనున్నామని చెప్పారు. వైద్యశాఖలో 20 ఏళ్లుగా హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని తొలగించడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న నేతలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 33 / 11 కేవీ డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలోని జెడ్పీ కాలనీ, పోస్టల్ కాలనీ, నేతాజీనగర్, ఇందిరాగాంధీనగర్, సంజయ్‌గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వివరించారు.

⇨ ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కరెంటాఫీస్ సెంటర్, న్యూ మిలటరీ కాలనీ, కేశవులునగర్, చైతన్యపురికాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

⇨ రంగనాథ సబ్‌స్టేషన్ పరిధిలోని రంగనాయకులపేట, ఇసుకడొంక, కపాడిపాళెం, మాగుంటనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు వరకు సరఫరా ఉండదన్నారు.

⇨ మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట, బంగ్లాతోట, ఎఫ్‌సీఐ కాలనీ, నజీర్‌తోట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. సండే మార్కెట్ సబ్‌స్టేషన్ పరిధిలోని బృందావనం, పొగతోట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని తెలిపారు.


⇨ కొండాయపాళెం సబ్‌స్టేషన్ పరిధిలోని కావేరినగర్, కొండాయపాళెం దళితవాడ, స్నేహనగర్, షిర్డీసాయినగర్, సంఘమిత్ర కళాశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11 వరకు.. రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామ్మూర్తినగర్, జేమ్స్‌గార్డెన్, బాలాజీనగర్, ఆదిత్యనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

స్టడీ మెటీరియల్ల అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని సుంకు చెంగన్న మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్లను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెజవాడ సునీల్‌రెడ్డి దాతృత్వంతో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.2500ను అందజేస్తామని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి, గోపీనాథ్, మేకల మనోజ్, ప్రధానోపాధ్యాయుడు అరవింద్, సిబ్బంది మస్తానయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

ప్రాథమిక స్థాయి నుంచే లక్ష్యాలు తెలపాలి



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఉషారాణి

నెల్లూరు (టౌన్): విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే నిర్దిష్టమైన లక్ష్యాలను నేర్పాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి పేర్కొన్నారు. గొలగమూడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. శిక్షణలో అందించే సూచనలను ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో అమలు చేసి, పిల్లల నుంచి అభ్యసన ఫలితాలను సాధించేలా కృషి చేయాలని కోరారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

నెల్లూరు(అర్బన్): ర్యాగింగ్‌తో జీవితాలు నాశనమవుతాయని ఏఎస్పీ సౌజన్య పేర్కొన్నారు. ర్యాగింగ్‌తో సంభవించే అనర్థాలు, కష్టనష్టాలపై నగరంలోని నారాయణ దంత వైద్య కళాశాల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ర్యాగింగ్‌తో సహచర విద్యార్థులను ఇబ్బంది పెట్టడం చట్ట విరుద్ధమని చెప్పారు. ఈ భూతానికి అనేక మంది విద్యార్థులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కొంతమేరకు తగ్గుముఖం పట్టినా, అక్కడక్కడా వివిధ రూపాల్లో కనిపిస్తూనే ఉందని చెప్పారు. తీవ్రత బట్టి 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని, వైద్య సర్టిఫికెట్లపై ర్యాగింగ్ ముద్ర వేస్తారని తెలిపారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే కళాశాల యాజమాన్యానికి తెలపాలని, వారు పట్టించుకోకపోతే 112, 100 నంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐలు సుబ్బారావు, వేణు, రూరల్ ఎస్సై లక్ష్మణరావు, డెంటల్ కళాశాల డీన్ శివకుమార్, వైద్యకళాశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సౌజన్య

భూ సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బహుజన ప్రజాసంఘ నేతలు వెంకటరమణయ్య, ఇమ్మానుయేల్, వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. భూ సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



డీఆర్వోకు వినతిపత్రమిస్తున్న నేతలు